

విజయ వారి

# మాయాబజార్

డైరెక్షన్.... కె.వి.రెడ్డి, Bsc. (HONS) * * * నిర్మాతలు... నాగిరెడ్డి & చక్రపాణి...

# పాత్రధారులు

| | |
|---|---|
| ఎన్. టి రామారావు | శ్రీ కృష్ణుడు |
| ఎ. నాగేశ్వరరావు | అభిమన్యుడు |
| ఎస్. వి. రంగారావు | ఘటోత్కచుడు |
| రేలంగి | లక్ష్మణకుమారుడు |
| గుమ్మడి | బలరాముడు |
| ముక్కామల | దుర్యోధనుడు |
| సి. యస్. ఆర్. | శకుని |
| ఆర్. నాగేశ్వరరావు | దుశ్శాసనుడు |
| మిక్కిలినేని | కర్ణుడు |
| నాగభూషణం | సాత్యకి |
| వంగర | శాస్త్రి |
| రామలింగయ్య | శర్మ |
| బాలకృష్ణ | సారధి |
| కుటుంబరావు | లంబు |
| నల్లరామమూర్తి | డంబు |

| | |
|---|---|
| సావిత్రి | శశిరేఖ |
| ఋష్యేంద్రమణి | సుభద్ర |
| సూర్యకాంతం | హిడింబ |
| ఛాయ | రేవతి |
| సంధ్య | రుక్మిణి |
| భానుమతి | రజని |
| యశోద | రాజరత్నం |
| సరస్వతి | బాల శశిరేఖ |
| ఆనంద్ | బాల అభిమన్యు |
| బాబ్జీ | చిన్నకృష్ణుడు |
| రమణారెడ్డి | చిన్నమయ |
| మాధవపెద్ది | దారుకుడు |

# మాయాబజార్ కథాసంగ్రహం

బాల శశిరేఖ పుట్టినరోజు పండుగకు సుభద్ర, బాలాభిమన్యుడూ వచ్చారు. అభిమన్యుని ధనుర్విద్యాసాహసం చూసి బలరాముడు ముచ్చటపడతాడు. శ్రీకృష్ణుని ప్రోత్సాహంతో, శశిరేఖ తన కోడలు కావాలని సుభద్ర కోరుతుంది. అలాగే జరిపిస్తానని బలరాముడు చేతిలో చెయ్యివేసి చెల్లెలికి మాట ఇస్తాడు. పాండవులంతటి అయిశ్వర్యవంతులతో సంబంధం నిశ్చయించినందుకు రేవతి పరమానంద భరితురాలవుతుంది.

శశిరేఖా అభిమన్యుడూ యుక్తవయస్కులయారు.

అప్పుడు ధర్మరాజుచేత దిగ్విజయంగా రాజసూయం జరిపించి వచ్చిన శ్రీకృష్ణుడు, బలరాములవారికి సత్యపీఠాన్నీ, శశిరేఖకు ప్రియదర్శినినీ కానుకగా ఇస్తాడు. ఎవరిచేతనైనా నిజాన్ని పలికించే మహిమ సత్యపీఠంలోనూ, ఎవరి ప్రియవస్తువును వారికి చూపించే మహిమ ప్రియదర్శినిలోనూ ఉంది. సరే సత్యపీఠాన్ని భద్రపరచి, అంతా ప్రియదర్శిని మహిమ ఏమిటో అని చూస్తారు. శశిరేఖ ఆ ప్రియదర్శినిని తెరవగానే ప్రేమగీతంతో అభిమన్యుడు కనిపిస్తాడు. రేవతికి ధనరాసులు కనిపిస్తాయి. బలరామునికి దుర్యోధనుడు కనిపిస్తాడు. శ్రీకృష్ణునికి పాచిక లెగురవేస్తూ శకుని ప్రత్యక్షమౌతాడు. ఆ దుష్టుడు ఏ కపటనాటక మాడుతున్నాడో అని కృష్ణుడు భయపడతాడు.

మాయాద్యూత విశారదుడైన శకుని, పాండవులను మోసంచేసి వారి సకల రాజ్యాన్నీ, వారి సర్వసంపదల్నీ కాజేసి ఇస్తానని శపథంచేసి, దుర్యోధనునిచేత ధర్మరాజును జూదానికి పిలిపించే ఏర్పాటు చేస్తాడు.

ద్వారకలో యాదవప్రముఖు లందరూ నృత్యవినోదంలో ఉండగా, ద్రౌపది ఆర్తనాదం విని శ్రీకృష్ణుడు ఆమె కభయమిచ్చి, పాండవుల రాజ్యసర్వస్వం దోచుకుని, దుర్యోధనుడు, వారి నడవులకు తోలాడని చెపుతాడు. సాత్యకి ప్రముఖులు కౌరవులమీదికి యుద్ధసన్నద్ధులు కాగా, వారిని వారించి, తాను దుర్యోధనునికి బుద్ధిచెప్పి, పాండవుల రాజ్యం ఇప్పించి వస్తానని, బలరాముడు హస్తినాపురానికి బయలుదేరి వెళతాడు.

కాని వెళ్లిన పని ఒకటి; చేసుకువచ్చిన పని ఒకటి అన్నట్లు, బలరాముడు, దుష్టచతుష్టయం చేసిన అతి సన్మానాలకూ అతిముఖస్తుతులకూ ఉబ్బిపోయి, వారి కల్లబొల్లి మాటలు నమ్మి కౌరవులు

ధర్మాత్ములు; పాండవులే దురాత్ములని నిర్ణయించడమే కాకుండా శశిరేఖను లక్ష్మణున కిచ్చి పెళ్లి చేస్తానని దుర్యోధనునికి మాటయిచ్చి వస్తాడు.

శ్రీకృష్ణుడు సుభద్రనూ అభిమన్యునీ ద్వారకకు తీసుకువస్తాడు. రాజ్యభ్రష్టులై వచ్చిన వీరిమీద రేవతికి మోజు పోతుంది. అన్యోన్యానురాగం గల శశిరేఖ అభిమన్యులు వెన్నెలరాత్రి నౌకా విహారం ఏర్పాటు చేసుకుంటారు. బలరాముడు వచ్చి శశిరేఖను లక్ష్మణునికిచ్చి పెళ్లిచెయ్యటానికి మాటిచ్చివచ్చానని చెప్పగానే రేవతి బ్రహ్మానందంపొంది, మొరాయించిన శశిరేఖను మేడమీద నిర్బంధంలో ఉంచుతుంది. కాని వెన్నెల రాగానే అభిమన్యుడు వచ్చి, బాణాలతో నిచ్చెన నిర్మించి శశిరేఖను మేడమీదినుంచి దించి, ఇద్దరూ రహస్యంగా నౌకావిహారానికి వెళతారు. భటులువచ్చి ఈ వార్త చెప్పగానే బలరాముడూ రేవతీ కోపంతో నదీతీరానికి బయలుదేరతారు. ఈ సంగతి తెలిసి శ్రీకృష్ణుడూ రుక్మిణీ వారికంటే ముందే వెళ్లి శశిరేఖాభిమన్యుల్ని రహస్యంగా పంపివేసి, రేవతీ బలరాములు తీరానికి వచ్చేటప్పటికి నౌకలోంచి తాము దిగుతారు. వీరినిచూసి భటులు పొరబడ్డారనుకుని రేవతీ బలరాములు శాంతపడి....ఆ వాతావరణకు ముచ్చటపడి తామూ కాస్త నౌకావిహారం చేసి వెళతారు.

లగ్నం నిశ్చయించుకుని శకుని ద్వారకకు వస్తాడు. వారు నిర్ణయించిన లగ్నం వరునికి అచ్చిరాదని బలరాముని సిద్ధాంతులు చెపుతుంటే, శకునితోబాటు శ్రీకృష్ణుడుకూడా ఈ పెళ్లి కీలగ్నమే మంచిదన్నయ్యా అంటాడు. సంతోషంతో బలరాము డా లగ్నానికి పెళ్లి నిశ్చయం చేస్తాడు.

ఈ సంగతి తెలిసి, సుభద్ర రోషంతోనూ దుఃఖంతోనూ వచ్చి, నా కిచ్చిన మాట తప్పి న న్నవమానిస్తావా అన్నయ్యా అని బలరాముని అడుగుతుంది. ఇది నేను దుర్యోధన చక్రవర్తికి నిండుసభలో ఇచ్చిన వరం, ఈ పెళ్లి జరిపి తీరతానంటాడు బలరాముడు. "అయితే నీవు ప్రతాపాల కన్న ఐశ్వర్యం శాశ్వతమనుకుంటున్నావా?" అంటుంది సుభద్ర. "ప్రతాపాల పేరెత్తి నన్ను బెదరిస్తావా. వేయిమంది అర్జునులూ భీములూకూడా ఒక్క దుర్యోధనుని కాలిగోటికి పోల"రంటాడు బలరాముడు. ఆ మాట విని అభిమన్యుడు రోషపడి అయితే నిర్భయంగా స్వయంవరం ఏర్పాటు చెయ్యండి; ఆ కౌరవుల్నందర్నీ చెండాడి శశిరేఖను నేను దక్కించుకుంటానంటాడు. అప్పుడు కృష్ణుడు చమత్కారంగా సుభద్రనూ అభిమన్యునీ మందలిస్తున్నట్టు మందలించి కర్తవ్యం ఉపదేశించి, మీకు దిక్కున్నచోటికి పొమ్మంటాడు. వారు ద్వైతవానానికి బయలుదేరగా, శ్రీకృష్ణుడు రహస్యంగా వారిని ఘటోత్కచుని ఆశ్రమానికి చేర్చమని దారుకునితో చెపుతాడు.

ఘటోత్కచుడు తన అనుచరు లందరితో వీరవిద్యాపరీక్షల్లో ఉంటాడు. అప్పుడు అక్కడ ఉన్న భూమీ దుందుభిద్వారా, అభిమన్యుని రథం తన అరణ్యంలోకి రావటం చూసి ఘటోత్కచుడు ఆ వీరుడెవరో హతమార్చిరమ్మని తన అనుచరుల్ని పంపిస్తాడు. అభిమన్యుడు ఆ మాయారాక్షసు ల్నందర్నీ సునాయాసంగా జయించటం చూసి ఘటోత్కచుడు స్వయంగానే వచ్చి అభిమన్యునితో తల పడతాడు. ఉభయులకీ భయంకరమైన అస్త్రయుద్ధం జరుగుతుంది. చివరికి ఘటోత్కచుడు ప్రయోగించిన ఒక శక్తిమాయ తెలుసుకోలేక దాని దెబ్బకు అభిమన్యుడు మూర్ఛపోతాడు అప్పుడు సుభద్ర ధనుర్బాణాలు ధరించి కృష్ణార్జునుల పేరులు స్మరించి బాణం విడువబోగా, ఆ పేరులు విని బంధుత్వం తెలిసి శరణు మాతా అంటూ ఘటోత్కచుడు వచ్చి ఆమె కాళ్లమీద పడి తన నెరింగించుకుంటాడు. అభిమన్యుడు మూర్ఛతేరగానే సోదరు లొకరినొక రాలింగనం చేసుకుంటారు. హిడింబకూడా వచ్చి సుభద్రాభిమన్యుల్ని తమ ఆశ్రమానికి తీసుకువెళ్లి పండుగలు జరిపి బ్రహ్మాండంగా ఆదరిస్తుంది.

తరువాత సంగతంతా సుభద్రవల్ల విని, "శశిరేఖను మాయగా ఎత్తుకురా, అభిమన్యుని కిచ్చి మన ఆశ్రమంలో పెళ్లి చేద్దా"మని చెప్పి హిడింబ ఘటోత్కచుని ద్వారకకు పంపిస్తుంది.

ఒకరాత్రివేళ ద్వారకకు వచ్చి ఘటోత్కచుడు అందర్నీ మాయాబద్ధుల్నిచేస్తుంటే, శ్రీకృష్ణుడు, ఒక వృద్ధుని రూపంలో అతనికి తారసిల్లి, తన మాయల కతడు చాలడనిపించి, చివరికి తెలివితెచ్చుకుని ఘటోత్కచుడు తననే స్తోత్రంచేయగా, నిజరూపంలో కనిపించి ఘటోత్కచునికి అక్కడ చేయవలసిన పనులన్నీ ఉపదేశిస్తాడు.

ఇక నిద్రిస్తున్న శశిరేఖను మాయాబలంతో ఘటోత్కచుడు తన ఆశ్రమానికి తీసుకునిపోయి సుభద్రకూ, హిడింబకూ అప్పగించి, సరిగా ఆ లగ్నానికే శశిరేఖాభిమన్యుల వివాహం జరిపించండని చెప్పి, తాను మాయాశశిరేఖయై ద్వారకకు వచ్చి ప్రవేశిస్తాడు. మాయాశశిరేఖను పెళ్లికూతుర్ని చేస్తారు. లక్ష్మణుని తీసుకుని దుర్యోధనుడు పెళ్లికి తరలివస్తాడు. ఘటోత్కచుని రాక్షసులంతా పెళ్లిపెద్దలై "మాయాబజార్"లో పెళ్లివారికి మాయకిరీటాలూ, మాయహారాలూ బహుమానం ఇస్తారు. ముందు పెళ్లికూతుర్ని చూపందీ పెళ్లి చేసుకోనని లక్ష్మణుడు పట్టుపట్టగా, ఘటోత్కచుడు మాయాశశిగా విడిదిలోకి వెళ్లి, భానుమతీ రాణినీ శకునినీ లక్ష్మణకుమారునీ చిలిపిచేష్టలతో బెదరకొట్టి అక్కడ వియ్యాలవారికి చేసిన విందుపదార్థాలన్నీ రహస్యంగా తాను గుటకాయస్వాహ చేసి చక్కాపోతాడు.

పెళ్లివారిలో లక్ష్మణుని సారథీ, దుర్యోధనుని పురోహితులూ మాకు కంబళ్ళు కాదు గింబళ్ళు కావాలనీ, తల్పాలు కాదు గిల్పాలు కావాలనీ పెళ్లిపెద్దలుగా ఉన్న రాక్షసుల్ని తంటాలుపెడతారు. వాళ్లు రాక్షసమాయతో నిర్మించి యిచ్చిన ఆ గింబళీ గిల్పాలతో రాత్రంతా నానాతిప్పలూ పడి కిక్కురు మనకుండా పెళ్లికి హాజరవుతారు.

ఇక పెళ్లిపీటలమీద కూర్చున్నప్పటినుంచీ లక్ష్మణకుమారుడు పేట్రేగిపోతాడు. మధ్యపట్టిన తెర తీసివేయమంటాడు. కాలు తొక్కించేటప్పుడు పాణిగ్రహణం చేసేటప్పుడు పెళ్లికూతురుకి తన ప్రతాపం చూపాలని గట్టిగా నొక్కుతాడు. మాయాశశి అంతకన్న ఎక్కువగా నొక్కగా కటకటలాడిపోతాడు. జీలకర్రా బెల్లం శిరసున పెట్టేటప్పుడు శశిరేఖ కోతిగానూ కొండముచ్చుగానూ కనిపించి లక్ష్మణుడు బెదిరిపోతాడు. శకునీ దుర్యోధనుడూ ధైర్యంచెప్పి ఫరవాలేదు తాళి కట్టమంటారు. తాళి కట్టవచ్చేటప్పటికి శశిరేఖ పెద్దపులిగానూ భూతంగానూ కనిపించి లక్ష్మణుడు మూర్ఛపోతాడు. ఈ అల్లరి పెళ్లికొడుకును చూసి బలరాముడికి కోపంవస్తుంది. "మేమంతా మంచివాళ్లమే. ఇది నీ కూతురు కాదు, మాయ శశిరేఖ రాక్షసి. ఇదంతా శ్రీకృష్ణుని మోసం" అని శకుని నిందిస్తాడు. ఎవరి మోసమో తెలుస్తుంది. ఈ పీఠంమీద నిలిచి మాట్లాడమని సాత్యకి సత్యపీఠాన్ని చూపిస్తాడు. దుర్యోధనుడు వారించినా వినక శకుని ఆ పీఠం మీద నిలుస్తాడు. ఇక దాని మహిమ చూడండి. "మాయజేసి పాండవుల రాజ్యం కాజేశాం. నీవు మా సాటివాడవు కాకపోయినా, పాండవుల కెప్పటికీ నీ సహాయం నీతమ్ముడి సహాయం లేకుండా చేయటానికే మీ సంబంధం ఒప్పుకున్నాం. నీవొక వెర్రిబాగుల యాదవుడివి. నా మాయలో పడ్డా" వని శకుని నిజం పలుకుతాడు. ఈ మోసం తెలియగానే బలరాముడు మండిపడతాడు. అప్పుడు ఘటోత్కచుడు, అతని అనుచరులు నిజరూపాలు దాల్చి కౌరవుల్ని నానాభీభత్సం చేస్తారు. వాళ్ల కిరీటాలు కుంపట్లయిపోతాయి. హారాలు పాములయిపోతాయి. ఆర్తనాదాలు చేస్తున్న ఆ దుష్టచతుష్టయానికి బుద్ధిచెప్పి ఘటోత్కచుడు వారిని మూటకట్టి హస్తినాపురంలో పారవేయిస్తాడు.

చివరికి ఘటోత్కచుడు చేసిన పనికి సంతోషించి బలరాముడు, రేవతి, కృష్ణుడు, రుక్మిణీ అందరూ అతని ఆశ్రమానికి వెళ్లి శశిరేఖాభిమన్యుల్ని దీవిస్తారు. ఇదంతా నా సుపుత్రుడు చేసిన ఘన కార్యమని హిడింబ సంతోషిస్తే, కాదు ఇదంతా శ్రీ కృష్ణులవారి దివ్యలీల అని ఘటోత్కచుడు స్తోత్రం చేయగా శ్రీకృష్ణ పరమాత్మ అందరికీ విష్ణురూపదర్శనం ఇస్తారు. మంగళం.




## ముత్తైదువులు

శ్రీకరులు దేవతలు శ్రీరస్తులనగ, చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా,
వర్ధిల్లు మా తల్లి వర్ధిల్లవమ్మా, చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా-

సకల సౌభాగ్యవతి రేవతీదేవి తల్లియై దయలెల్ల వెల్లివిరియగను
అడుగకే వరములిడు బలరామ దేవులే జనకులై కోరిన వరము లీయగను ॥ వర్ధిల్లు ॥

శ్రీ కళల విలసిల్లు రుక్మిణీదేవి పినతల్లియై నిన్ను గారాము శాయ
అఖిల మహిమలు కలుగు కృష్ణపరమాత్ములే పినతండ్రియై సకల రక్షణలు శాయ ॥ వర్ధిల్లు ॥

ఘన వీరమాతయగు శ్రీ సుభద్రాదేవి మేనత్తయై నిన్ను ముద్దు శాయగను
పాండవయువరాజు బాలు డభిమన్యుడే బావయై నీవె తన లోకమని మురియ ॥ వర్ధిల్లు ॥

## శశి చెలికత్తెలు

అల్లిబిల్లి ఆటలే లల్లిలలా పాటలే ఎవరెవరే కోయిలలూ కుహూ కుహూ కుహూ కుహూ
ఎవరెవరే నెమిళులూ కెకే కెకే కెకే కెకే ఎవరెవరే ఎవరెవరే వన్నెలేడి పిల్లలూ ॥ లల్లిలలా ॥

అల్లిబిల్లీ అమ్మాయికి చేల చేల్లని జోశ్యం చెపుతామూ - చేక చేక్కని జోశ్యం చెపుతామూ -
యౌవన శోభల పర్వమే - ఇది బావను తలచుకు గర్వమే - ఆ బావే తన కిక సర్వమే ॥ అల్లీబిల్లీ ॥

ఉన్న మాటకీ ఉలుకెందుకు - మరి ఉన్నదె చెపుతామూ - వలదన్నా చెపుతామూ
నూతన విద్యల ప్రవీణుడే - బల్ ప్రతిభావంతుడె నీ బావా - అతి చతుర వీరుడె నీ బావా ॥ అల్లీబిల్లీ ॥

మల్లీజాజీ మాలతీ సంపెగ పూల బాణములు వేసేనూ
బాలామణి తా మురిసేనూ - తన పెళ్లికి బావను పిలిచేనూ ॥ అల్లీబిల్లీ ॥

## అభిమన్యు - శశి

అభి :—నీవేనా నను తలచినది, నీవేనా నను పిలచినది,
నీవేనా నామదిలో నిలిచి హృదయము కలవరపరచినది ॥ నీవేనా ॥

శశి :— నీవేలే నను తలచినది నీవేలే నను పిలచినది
నీవేలే నామదిలో నిలిచి హృదయము కలవరపరచినది ॥ నీవేలే ॥

అభి :—కలలోనే ఒక మెలకువగా - ఆ మెలకువలోనే ఒక కలగా
కలయో నిజమో వైష్ణవమాయో తెలిసీ తెలియని అయోమయములో ॥ నీవేనా ॥

శశి :— కన్నులవెన్నెల కాయించి నా మనసున మల్లెలు పూయించి
కనులను మనసును కరగించీ, మై మరపించీ - నన్నలరించీ ॥ నీవేలే ॥

## నృత్యనాటకం

గోపికలు :—విన్నావ యశోదమ్మా ! మీ చిన్ని కృష్ణుడు చేసినట్టి అల్లరి చిల్లరి పనులు.... ॥ విన్నావ ॥

యశోద :—అన్నెం పున్నెం ఎరుగని పాపడు మన్నుతినే నా చిన్నితనయుడు
ఏమి చేసె నమ్మా ఎందుకు రవ్వ చేతురమ్మా....

గోపికలు: —ఆఁ మన్ను తినేవాడా ! వెన్న తినేవాడా ?
కాలిగజ్జెల సందడి సేయక పిల్లివలే మా యింట్లో దూరి
ఎత్తుగ కట్టిన ఉట్లందుకొని దుత్తలన్నీ క్రింద దించుకొని
పాలన్నీ తాగేశెనమ్మా పెరుగంతా జూరెశెనమ్మా వెన్నంతా మెక్కేశెనమ్మా

కృష్ణుడు :—ఒక్కడె ఎట్లా తినేశెనమ్మా ? ఎక్కడనైనా కలదమ్మా, ఇది ఎక్కడనైనా కలదమ్మా ?
విన్నావటమ్మా ఓ యశోద ! గోపికరమణుల కల్లలూ ఈ గోపికరమణుల కల్లలూ....

గోపికలు :—ఆఁ ఎలా బూకరిస్తున్నాడో ! పోనీ, పట్టిద్దామంటే చిక్కతాడా !
భామలంద రొక యుక్తిని పన్ని గుమ్మము నొకరుగ కాచియుండగా
ఒక రింట్లో విని గజ్జెల గలగల ఒక రింట్లో విని వేణుగానమూ. (అహా. ఇంకేం.)
దొంగ దొరికెనని పోయి చూడగా ఛంగున నెటకో దాటిపోయె
ఎలా వచ్చెనో ఎలా పోయెనో చిలిపి కృష్ణునే అడగవమ్మా....

కృష్ణుడు :—నాకేం తెలుసు. నే నిక్కడ లేందే!

యశోద :—మరి ఎక్కడున్నావు ?

కృష్ణుడు :—కాళింది మడుగున విషమును కలిపే కాళియు తలపై తాండవమాడి
ఆ విషసర్పము నంతము జేసి గోవుల చల్లగ కాశానే....

ద్రౌపది :—హే కృష్ణా.... హే కృష్ణా ముకుందా మొర వినవా :
నీవు వినా దిక్కెవ్వరు దీనురాలి గనవా : కృష్ణా : నా
దీనగతిని గనవా.... కృష్ణా కృష్ణా కృష్ణా....

## అభిమన్యు - శశి

అభి :—చూపులు కలసిన శుభవేళా ఎందుకు నీ కీ కలవరము ఎందుకు నీ కీ కలవరము
ఉల్లాసముగా నే నూహించిన అందమె నీలో చిందెనులే ॥ చూపులు ॥

శశి :— చూపులు కలసిన శుభవేళా ఎందుకు నీ కీ పరవశము ఎందుకు నీ కీ పరవశము
ఏకాంతములో ఆనందించిన నా కలలే నిజమాయెనులే ॥ చూపులు ॥

అభి :—అలాపనలూ సల్లాపములూ కలకల కోకిల గీతములే
చెలువములన్నీ చిత్ర రచనలే చలనము లోహెూ నాట్యములే ॥ చూపులు ॥

శశి :— శరములవలెనే చతురోక్తులను చురుకుగ విసిరే నైజములే
ఉద్యానమున వీరవిహారమే చెలికడ నోహెూ శౌర్యములే ॥ చూపులు ॥

## అభిమన్యు - శశి

అభి :—లాహిరి లాహిరి లాహిరిలో ఓహొ జగమే ఊగెనుగా - ఊగెనుగా - తూగెనుగా

శశి :—లాహిరి లాహిరి లాహిరిలో ఓహొ జగమే ఊగెనుగా - ఊగెనుగా - తూగెనుగా
తారా చంద్రుల విలాసములతో విరిసే వెన్నెల పరవడిలో
పూల వలపుతో ఘుమఘుమలాడే పిల్ల వాయువుల లాలనలో   లాహిరి లాహిరి

అభి :—అలల ఊపులో తీయని తలపులు చెలరేగే ఈ కలకలలో
—మయిమరపించే ప్రేమనౌకలో హాయిగ చేసే విహరణలో

అభి, శశి :—లాహిరి లాహిరి లాహిరిలో ఓహొ జగమే ఊగెనుగా, తూగెనుగా, సాగెనుగా.

## దారుక

భళి భళి భళి భళి దేవా బాగున్నదయా నీ మాయా బహు బాగున్నదయా నీ మాయా ॥
ఒకరికి ఖేదం ఒకరికి మోదం సకలము తెలిసిన నీకు వినోదం
నీ వా రెవరో పై వా రెవరో ఆ విధికైనను తెలియదయా ॥ బాగున్నదయా ॥

సుఖ దుఃఖాలతో గుంజాటనపడు లోకము నీ చెలగాటమయా
లీలలు మాయలు నీ గుణకథలూ తెలిసిన వారే ధన్యులయా ॥ బాగున్నదయా ॥

## ఘటోత్కచుడు

అష్ట దిక్కుంభి కుంభాగ్రాలపై మన - శుంభధ్వజము గ్రాల చూడవలదె!
గగన పాతాళ లోకాలలోని సమస్త - భూతకోటులు నాకె మ్రొక్కవలదె!
ఏదేశమైన నా ఆదేశముద్ర పడి - సంభ్రమాశ్చర్యాల జరుగవలదె!
"హై హై ఘటోత్కచ! జై హే ఘటోత్కచ!" - అని దేవగురుడె కొండాడవలదె!

ఏనె యీ యుర్వినెల్ల శాసించవలదె, ఏనె ఐశ్వర్యమెల్ల సాధించవలదె,
ఏనె మన బంధు హితులకు ఘనత లన్ని - కట్టపెట్టిన ఘనకీర్తి కొట్టవలదె!

## అభిమన్యు - శశి

శశి :— నీ కోసమె నే జీవించునది ఈ విరహములో ఈ నిరాశలో ॥ నీ కోసమె ॥
వెన్నెలకూడా చీకటియైనా మనసున వెలుగే లేకపోయినా ॥ నీ కోసమె ॥

అభి :—విరహముకూడా సుఖమేకాదా నిరతము చింతన మధురముకాదా
వియోగ వేళల విరిసే ప్రేమల విలువను గనలేవా
నీ రూపమె నే ధ్యానించునది నా హృదయములో నా మనస్సులో ॥ నీరూపమె ॥

శశి :— హృదయము నీతో వెడలిపోయినా మదిలో ఆశలు మాసిపోయినా
మన ప్రేమలనే మరి మరి తలచీ ప్రాణము నిలుపుకొనీ నీ కోసమె నే జీవించునది.

అభి :—మెలకువనైనా కలలోనైనా కొలుతును నిన్నే ప్రణయదేవిగా
లోకములన్నీ ఏకమెయైనా ఇక నాదానవెగా....నీ రూపమె నే ధ్యానించునది.

శశి :— ఈ విరహములో ఈ నిరాశలో నీ కోసమె నే జీవించునది.

## ఘటోత్కచుడు

దురహంకార మదాంధులై ఖలులు విద్రోహంబు గావించిరే!
అరరే! వారికి శృంగభంగమును చేయన్ లేరొకొ! లోక భీ
కరు డీ వీర ఘటోత్కచుండు! ఇదె ప్రతిజ్ఞన్ చేసినాడన్ తృటిన్
కురువంశమ్ము దహించెదన్ యదుకుల క్షోభంబు గావించెదన్ !

## మాయాబజారు — ఆహ్వానం

1. దయచేయండీ దయచేయండీ తమంత వారిక లేరండీ ॥
అతి ధర్మాత్ములు అతి పుణ్యాత్ములు అతి ధీమంతులు మీరండీ
తగు కైవారం తగు సత్కారం తగుమాత్రంగా గైకోండీ
తమంత వారిక తమరండీ - యీ తతంగమంతా తమకండీ
హైహై వైవై కైకై గైగై జియ్యా........

2. పెళ్లికుమారా, రావయ్యా, మా భాగ్యంకొద్దీ దొరికావయ్యా ॥
ముల్లోకాలను వెదకి తెచ్చిన అల్లుడవంటే నీవయ్యా
ముల్లోకాలను గాలించి తెచ్చిన అల్లుడవంటే నీవయ్యా,
పల్లకి నిక దిగి రావయ్యా, తతంగమంతా నీకయ్యా, యీ
తతంగమంతా నీ కయ్యా హైహై, వైవై కైకై గైగై జియ్యా....

3. కిరీటాలు, కిరీటాలు! వజ్రాల కిరీటాలు! ధగధగ కిరీటాలు!
ధరించినంతనె తలలో మెరయును ఐలే యోచనలు బ్రహ్మాండముగా
శిరస్త్రాణములు శిరోధార్యములు శిరోజ రక్షలు కిరీటా లివె
అందుకోండయ్యా దొరలు ముందుకు రండయ్యా

4. హారాలూ - మణిహారాలూ, పతకాలూ - నవ పతకాలూ ॥
మణిబంధాలూ భుజబంధాలూ అందాలకు అనుబంధాలూ
వింత చీరెలూ - వింత ముసుగులూ సంతోషాలకు సంబంధాలూ
అందుకోండమ్మా తల్లులు ముందుకు రండమ్మా

5. రక్షలు రక్షలు పాద రక్షలూ నాట్య శిక్షలో బాల శిక్షలూ ॥
తొడిగిన తోడనె - తోధిమి తోధిమి, అడుగు వేయగనె - తైతక తైతక
నేలమీద నిక నిలువగ నీయక కులసాగ మిము నటింపజేసే రక్షలు రక్షలు ॥

6. ఒకటే మా వయసూ ఓ రాజా ఒకటే మా సొగసూ ॥
నయగారము నా కళరా వయ్యారము నా వలరా - ఒయ్
నేనే నీ జోడురా నేనే నీ యీడురా వన్నె చిన్నె లెన్నరా ఓ రాజా ॥
సరసతలో యిది జాణరా రసికతలో యిది రాణిరా, ఒయ్
నిన్నే కోరితిరా నిన్నే చేరితిరా వన్నె చిన్నె లెన్నరా ఓ రాజా ॥

మాయశశి :

అహ నా పెళ్లంట! ఓహొ నా పెళ్లంట!
మీకు నాకు చెల్లంట - లోకమెల్ల గోలంట టాం - టాం - టాం ॥ అహ నా ॥

వీరాధి వీరులంట - ధరణీ కుబేరులంట
భోరు భోరుమంటు - మా పెళ్లివారు వచ్చిరంట అబ్బబ్బబ్బబ్బొ ॥ అహ నా ॥
బాలాకుమారినంట - చాలా సుకుమారినంట
పెళ్లికొడుకు నన్నుచూసి - మురిసి మూర్ఛపోవునంట అయ్యొయ్యొయ్యొ........ ॥ అహ నా ॥
తాళి కట్టవచ్చునంట - తగని సిగ్గు నాకంట తాళి - కట్టవచ్చునంట -
పాద నిదపమ - మాపదపమగ తాళి కట్టవచ్చునంట -
పప ప్పాద - మమమ్మాప - గగగ్గామ - రిగమప తాళి కట్టవచ్చునంట -
తథోం థోం థోంత - తధీం ధీం ధీంత తథోంత తధీంత అటు తంతాం -
ఇటు తంతాం తంతాం - తంతాం - తంతాం - సనిదప మగరిస
తాళి కట్టవచ్చునంట - తగని సిగ్గు నాకంట
మేలిముసుగు చాటుచేసి - దాగుడుమూత లాడెనంట అహ్హహ్హహ్హ........

## మాయశశి - లక్ష్మణకుమారుడు

లక్ష్మణ :—సుందరి నీవంటి దివ్యస్వరూపంబు ఎందెందు వెదకిన లేదుకదా - నీ
అందా చందాలింక నావేకదా సుందరి - ఓహొ సుందరి -

మాయాశశి :—దూరం, దూరం!

లక్ష్మణ :—దూరమెందుకు చెలియ వరియించి వచ్చిన
ఆర్యాపుత్రుడ నింక నేనేకదా - మన పెళ్లివేడుక లింక రేపేకదా ॥ సుందరి ॥

మాయాశశి :—రేపటిదాకా ఆగాలి!

లక్ష్మణ :—ఆగుమంచు నకియ అరమర లెందుకె సొగసులన్నీ నాకు నచ్చేకదా -
నీ వగల నా విరహము హెచ్చేకదా ॥ సుందరి ॥

మాయాశశి :—హెచ్చితే ఎలా? పెద్దలున్నారు!

లక్ష్మణ :—పెద్దలున్నారంచు హద్దులెందుకె రమణి వద్దకు చేరిన పతినేకదా -
నీ ముద్దుముచ్చట లింక నావేకదా ॥ సుందరి ॥

### ఘటోత్కచుడు

వివాహ భోజనంబు - వింతైన వంటకంబు వియ్యాల వారివిందు - ఒహొహొహొ నాకె ముందు ॥ వివాహ ॥

ఔరౌర గారెలల్ల - అయ్యారె బూరెలిల్ల ఓహోరె! అరిసెలుల్ల - ఇవెల్ల నాకె చెల్ల
బళీరె! లడ్డులందు - వఃపేణి పోణిలిందు బలే జిలేబిముందు - ఇవెల్ల నాకె విందు ॥ వివాహ ॥

మఘూరె! అప్పళాలు - పులిహోర దప్పళాలు వహ్వారె పాయసాలు - ఇవెల్ల నాకె చాలు ॥ వివాహ ॥

### శకుని

శకుని ఉన్నచాలు, శనియేల నని కదా ఔను, నిజమె నేను నంత ఘనుడ -
కాని పనులనైన కాజేసుకొని గాని మానిపోవలేనె మాయలాడి!

### ఘటోత్కచుడు

స్వాతిశయమున తృళ్లు నైశ్వర్య గర్వ - దుర్విదగ్ధులు, మీరెల్ల దుమ్ముధూళి
కలియు కాలము దగ్గర కలదటంచు - బుద్ధితెచ్చుకు బ్రతుకుడు పొండు పొండు!
పాండవులె కాదు, పాండవ బంధుకోటి - బంధు బంధుల బంధుల బంధులందు
ఎవరి నెదిరింతురేని మీకిదియె శాస్తి! - జ్ఞప్తి కలిగుండుడీ ఘటోత్కచుని మాట!

### ఘటోత్కచుడు

జై సత్యసంకల్ప జై శేషతల్పా!
జై దుష్టసంహార, జై దీనకల్పా! జై భక్తపరిపాల, జై జగజ్జాలా!
నీవు జరిపించేటి నీ చిత్రకథలు! వ్రాసినా, చూసినా, వినిన ఎల్లరును
శుభసంపదలు గలిగి వర్ధిల్లగలరు! సుఖశాంతులను గలిగి శోభిల్లగలరు.

---

ఈ పాటలు హెచ్. యం. వి. & కొలంబియా రికార్డులలో వినండి.

# టెక్నిషియన్లు

కథ, మాటలు, పాటలు } పింగళి నాగేంద్రరావు

సంగీతం . . . . . ఘంటసాల

ఛాయాగ్రహణం . . మార్కస్ బార్ట్లీ

శబ్దగ్రహణం . } ఎ. కృష్ణన్ బి. ఏ. శివరాం బి. ఏ.

ప్రోసెసింగ్ . . ఎస్. సి. సేన్‌గుప్త B.Sc.

ఆర్టు . . . . గోఖలే :: కళాధర్

ఆభరణములు . . . . . జయరాం

డాన్సు . ప. కృష్ణమూర్తి :: గోపీనాథ్

ఆర్కెస్ట్రా . . . . ఏ. కృష్ణమూర్తి

ఎడిటింగ్ . జంబులింగం :: కల్యాణం

మేకప్ . పీతాంబరం :: భక్తవత్సలం

స్టిల్సు . . . . ఋషభేంద్రయ్య

ప్రొడక్షన్ ఇన్‌చార్జి . జగన్నాథ్ :: చలపతిరావు

ప్లేబాక్ : ఘంటసాల, మాధవపెద్ది, లీల, వసంతకుమారి, సుశీల, జిక్కి

నృత్యం : గోపీనాథ్, లలితారావు, యం.ఎ. రీటా, సరోజ

దర్శకుడు : **కె. వి. రెడ్డి,** B. Sc. (Hons)

నిర్వహణ: **నాగిరెడ్డి, చక్రపాణి**

స్టూడియో : **వాహిని**

నిర్మాతలు : **విజయ**

PRINTED AT THE B. N. K. PRESS (PRIVATE) LTD., MADRAS - 26

విజయ వారి

రాబోవు చిత్రము

# అప్పుచేసి పప్పుకూడు

డైరెక్షన్..... ప్రసాద్

నిర్మాతలు.... నాగిరెడ్డి & చక్రపాణి

N44